తులసి ముఖంలో జాలి తొణికిసలాడింది "పూర్ ఫెలో."

"ఎగ్జాక్ట్లీ! అదే వాళ్ళావిడ అభిప్రాయం కూడా అయ్యుంటుంది"

తులసి వెళ్ళిపోయింది.

మరికాసేపటి తర్వాత తనూ రడీ అయి బయటి కొచ్చాడు సురేష్. గంగాభవానికూరగాయల మొక్కలకు పాదులు తీస్తోంది. సురేష్ని చూచి లేచి నిలబడింది. పైట సరిచేసుకుంది ముఖం మాడ్చుకుంటూ.

"మా వాటా వైపున్న చిక్కుడుపాదు మాదా, మీదా?" అడిగాడు సురేష్ .

"మీదెలా అవుతుంది?"

"దున్నేవాడిదే భూమి అంటారు కదా! నేను పొద్దున్న దానికి నీళ్ళు పోశాను"

"నీళ్ళు పోయగానే అయిపోయిందేమిటి?"

"ఇంకేం చేస్తే అవుతుంది?"

అసహనం పెరిగిపోతోందామెకి. సురేష్కి ఆనందం పెరిగిపోతోంది.

"మొక్కలు అద్దెకివ్వలేదు-ఇల్లొక్కటే"

"నేను అన్నీ కలిసి అనుకున్నాను"

ఆమె ముఖం మరింత ఎర్రబడింది. పావురాయి కళ్ళు డేగ కళ్ళవుతున్నాయ్. ఇప్పుడు ఆమెను 'కూల్' చేయాల్సిన సమయం. ఆమె మళ్ళీ పాదుల దగ్గర కూర్చుంది.

చటుక్కున ఆమె కెదురుగా కూర్చున్నాడతను.

"ఆగండాగండి-ఏదీ-మీ చేయి చాపండి"

అనుమానంగా చూసిందామె "ఎందుకు?"

"అదో పిచ్చి! కనబడ్డవారికల్లా చేయి చూసి చెపుతూంటాను. నేర్చుకున్న విద్య వృధా ఎందుకు చేయాలి?"

"అంటే?"

"జ్యోతిస్సామ్రాట్ వామనశాస్త్రిగారు మా గురువు"

ఆమె చేయి నెమ్మదిగా ముందుకొచ్చింది. కానీ అంతలోనే వెనక్కు లాగేసుకుంది.

"నా కవసరం లేదు."

"మీరు నిజంగా గొప్ప అదృష్టవంతులు"

"ఎందుకు?"

"మిమ్మల్ని స్వర్గ సుఖాల్లో ముంచి తేల్చే సమయం అతిత్వరలో వచ్చేస్తోంది."

"అంతా వట్టిదే."

"ఆరు నెలల్లోపల మీ జీవితం అతి అద్భుతమైన మలుపు తిరగబోతోంది."

"నేన్నమ్మను"

"నమ్మకపోయినా ఆ సమయం వచ్చినప్పుడు కాదనకండి."

సురేష్ బయటి కొచ్చేస్తుంటే ఆమె పరధ్యానంలో మునిగిపోయింది.

*　　　*　　　*　　　*

లైబ్రేరియన్ నవ్వింది సురేష్‌ని చూసి. "ఎనీ లక్?" రిజిష్టర్ అతని ముందుకి తోస్తూ అడిగింది "ఎస్!"

ఆశ్చర్యపోయిందామె.

"ఎక్కడ- ఏ డిపార్ట్‌మెంట్‌లో దొరికింది?" ఆత్రుతగా అడిగింది.

"అదే"

"మై గాడ్-లైబ్రరీలోనా?"

"అవును"

"టెంపరరీయా, పర్మనెంటా?"

"మనకిష్టమున్నంత కాలం."

"జీతమెంత?"

"జీతం వుండదు. మిమ్మల్ని చూస్తూ కూర్చుంటే జీతం ఎవరిస్తారు?"

ఆమెకు అర్థమైంది "ఓ! వాటేమేన్ యూ ఆర్."

"ఆఖర్లో మా తులసి కూడా ఇదే మాటంటుంది!"

"తులసి ఎవరు?"

"భార్యలాంటి అమ్మాయి."

ఆమె నవ్వాపుకోలేకపోయింది.

"నిన్నటి పేపర్స్ కావాలి" అడిగాడు సురేష్ .

"తీసుకోండి"

పేపర్లన్నీ త్వరగా వెతకసాగాడు. మామూలుగానే శ్రమంతా వృధా. బయటకొచ్చేప్పుడు లైబ్రేరియన్ మళ్ళీ నవ్వింది.

ఆమె టేబుల్ దగ్గర ఆగాడతను "మీరు చాలా అందంగా వున్నారు?"

"థాంక్యూ! " అందామె సిగ్గుపడుతూ.

"మీ భర్త ఎవరోగాని నాకు చాలా జాలిగా వుంది."

"ఎందుకు?"

"నిద్రలేమి జబ్బుతో కన్ను మూస్తాడేమోనని."

"మీరు చాలా ఇదిగా మాట్లాడతారు-అయినా నాకు పెళ్ళి కాలేదు యింకా."

"భర్తంటే ప్రస్తుతం భరిస్తున్నవాడు అని అర్థం."

అతను బయటికొచ్చేశాడు. వెనక్కు తిరిగి చూసి వుంటే....

ఆమె ముఖంలోని సరికొత్త ఎక్స్‌ప్రెషన్- అంతకుముందు మరే అమ్మాయి ముఖంలోనూ చూడనిది- గమనించి వుండేవాడు.

*　　　　　*　　　　　*　　　　　*

గది తలుపులు తెరిచేసరికి విస్కీ వాసన గుప్పుమంది.

డార్క్ డెవిల్ సురేష్‌ని చూసి ఆనందంగా చేతులు జాపాడు.

"కమాన్, కమాన్, కమాన్ లాంగ్ లాంగ్ టైమ్-లాంగ్ లాంగ్ టైమ్."

సురేష్ గదంతా చుశాడు.

"ఇదా నువ్వుండే నరకం?"

"నరకాన్ని ఇన్సల్ట్ చేయకు."

సురేష్ డార్క్ డెవిల్ భుజం మీద చేయి వేసి వాడి బుగ్గమీద ముద్దు పెట్టుకున్నాడు.

"జాబ్ ఎందుకని చేయటం లేదురా?"

"చేయట్లేదని ఎవరన్నారు?"

"ఏం జాబ్?"

మూలగా ఎలక్ట్రిక్ గిటార్ దగ్గరకెళ్ళి వాయించటం ప్రారంభించాడతను.

"ఎమ్మే సోషియాలజీ చదివి గిటార్ వాయిస్తున్నావా?"

డార్క్‌డేవిల్ ప్లే చేయటం ఆపేశాడు. విస్కీబాటిల్ తీసుకొని రెండు గ్లాసుల్లో పోశాడు.

"మాన్ ఈజ్ సోషల్ యానిమల్! ఎవరీ మాటంది? ఆరిస్టాటిల్ గాడు-వాడెక్కడయినా కనిపించనీ... మర్డర్ చేసేది ఖాయం."

"ఎందుకు?"

"యానిమల్‌ని అలా అవమానపరచినందుకు. మందు కొడతావా?"

"అకేషన్ లేందే కొట్టను"

డార్క్‌డెవిల్ త్వరత్వరగా ఆలోచించాడు.

"మనం చాలా రోజుల తరువాత కలుసుకున్నాం."

"అయితే ఓ.కే...." గ్లాసు తీసుకున్నాడు. "నీకెలా అలవాటయిపోయింది?"

"ఒకరోజు త్రీ ఏసెస్‌లో క్యాబరే షోకి గిటార్ వాయిస్తూంటే, అద్భుతంగా వుందని ఒకడు యాభయ్ నోటు విసిరాడు నామీద. తీరాచూస్తే వాడు లలిత్‌గాడు. వాడి గాళ్ ఫ్రెండ్‌తో వచ్చాడు."

"లలిత్ అంటే మనిద్దరం పరీక్ష ల్లో వాడికి కాపీలందించాం."

“ఎగ్జాక్ట్‌లీ! వాళ్ళ ఫాదర్ ఎం.పి కదా! అందుకని ఐ.ఏ.ఎస్.కి సెలక్టయ్యాడు. వాడితో ఫైటింగ్ చేసినప్పుడు తగిలిందిది” దెబ్బచూపుతూ అన్నాడు.

“ఫైటింగ్ చేశావా?”

“అవును”

“ఎందుకు?”

“కాన్‌ఫ్లిక్ట్ ఈజే కాంషన్ యాక్షన్!

కాన్‌ఫ్లిక్ట్ ఈజే పర్సనల్ యాక్టీవిటీ!

కాన్‌ఫ్లిక్ట్ లాక్స్ కంటున్యుటి!

కాన్‌ఫ్లిక్ట్ ఈజ్ యూనివర్సల్!

బాస్టర్డ్! పలకరిస్తే నేనెవరో తెలీదు పొమ్మన్నాడు. ఒకే ఒక్కగుద్దుతో వెళ్ళి మిలటరీ మేజర్ భార్య వళ్ళో పడ్డాడు. పావుగంటసేపు ఫైటింగ్ చేశాం. ఆఖర్లో-బాస్టర్డ్! మిగిలిన బాటిల్. తీసుకుని ముఖం మీద కొట్టాడు.”

బయట వ్యాన్ ఆగిన చప్పుడయింది. ఇద్దరు యువకులు దిగి గదిలో కొచ్చారు.

“కమింగ్ బాస్! కమింగ్” అన్నాడు డార్క్‌డెవిల్. వాళ్ళు ఎలక్ట్రిక్ గిటార్ తీసుకెళ్ళి వ్యాన్‌లో పెట్టారు.

డార్క్‌డెవిల్ ముఖం కడుక్కుని తల దువ్వుకున్నాడు.

“మ్యారేజ్‌లో ప్రోగ్రామ్ ఇవ్వాలి. మళ్ళీ ఎప్పుడు వస్తావు?”

“నీ యిష్టం.”

“ఎల్లుండి రా...! డెబనీర్ బార్‌లో వుంటాను. రాత్రి పన్నెండు లోపల ఎప్పుడయినా సరే....”

గదికి తాళం వేసి వెళ్ళి వ్యాన్‌లో కూర్చున్నాడు. లోపల యింకా బోలెడుమంది డార్క్‌డెవిల్స్ వున్నారు.

“మరిచిపోయాను. మొన్న నీ పక్కనున్న పిల్ల టెర్రిఫిక్ షేప్! వదిలెయ్యకు. సోషియాలజీలో ఏమన్నాడు? ఇటీజ్ కల్చర్ దట్ మేక్స్ ది హ్యూమన్ ఏ యానిమల్ మాన్! ఆ పిల్ల వండర్ ఫుల్ కల్చర్!”

చౌరస్తా దగ్గరకు చేరుకున్నాడు సురేష్.

జనం ప్రవహించడం ప్రారంభమైంది. అన్ని వైపులనుంచి అన్ని వైపులకూ కలగా పులగంగా కొన్ని వేల శబ్దాలు, స్వరాలూ, కొన్ని వేల శబ్దాల్నీ, స్వరాల్నీ ఖండిస్తూ.

“వాడిని మర్డర్ చేస్తాను చూడు.....”

“సైకిల్ చైన్ వూడిపోయింది”

"మన మీద మా వారికి అనుమానంగా వుంది."

"పెన్సిలిన్ రియాక్షన్ యిచ్చిందట పాపం..."

వాటిల్లోనుంచి బయటపడి "302428" అనుకున్నాడతను.

తులసి, దీప దగ్గరికి వచ్చారు.

"ఎంతసేపయింది వచ్చి?" అలసిపోయిన కళ్లతో మరింత అందంగా, మరింత సెక్సీగా వుంది తులసి .

"ఇప్పుడే"

దీప సురేష్ వైపు చూడకుండా వుండటానికి ప్రయత్నిస్తోంది.

"దీపాజీ! ఎలా వుంది?"

"ఏమిటెలా వుంది?"

"అదివరక్కూ, ఇప్పటికీ తేడా?"

ఆమె ముఖం ఎర్రబడింది.

"నేను వెళుతున్నాను" చరచరా నడిచింది.

"పద వెళ్దాం"

బస్‌స్టాప్ కిటకిటలాడిపోతోంది.

"మా బాస్‌కి మన సంగతి తెలిసిపోయింది..." నెమ్మదిగా అంది తులసి .

"వాడు నీకు ఛేస్టిటీ బెల్ట్ కట్టినట్లు గుర్తులేదే...."

అతని చేతిమీద గట్టిగా గిల్లిందామె.

"టైపిస్ట్ రమీలా చెప్పిందట. మనం రోజూ యిక్కడ కలుసుకోవటం చూస్తోంది కదా! జెలసీ...."

"అయితే రేపట్నుంచీ ఒకరోజు నువ్వూ, ఒకరోజు రమీలా."

బస్ వచ్చింది.

కండక్టర్ సురేష్‌ని గుర్తుపట్టాడు.

"ఆడ టికెట్లా? మగ టికెట్లా?"

"ఆడే..."

ఇంటికి చేరుకుని లోపలికి అడుగు పెడుతోంటే గంగాభవాని వచ్చి గడప దగ్గర నిలబడింది " మీ కోసం ఎవరో వచ్చారు" పక్కకి తప్పుకుంటూ అంది "మీరు వస్తారు వుండమని చెప్పి కూర్చోబెట్టాను."

సురేష్ నవ్వాడు.

"మీ ఋణం వుంచుకోను. ఏదోక రోజు తీర్చేస్తాను. ఏదో ఒక విధంగా..."

ముసలాయన లోపలికొచ్చాడు.

అతని మాట ఆగిపోయింది. ముఖం రంగు మారిపోయింది.

"రెండు రోజుల్నుంచీ వెతుకుతుంటే ఇప్పటికి దొరికింది ఇల్లు" అన్నాడతను.

తులసి సురేష్ వైపు చూస్తోంది వివరాల కోసం.

గంగాభవాని విజయగర్వంతో కసిగా, తృప్తిగా చూస్తోంది.

"నువ్విలాంటి నీచమయిన పని చేస్తావనుకోలేదు..." ముసలాయన కోపంగా అన్నాడు.

"ఆ గది మా యిద్దరికీ చాలదు. అందుకని ఖాళీ చేశాను" అన్నడు సురేష్ .

"ఖాళీ చేయలేదు. అర్థరాత్రి పారిపోయావు ఆరునెలల అద్దె ఎగ్గొట్టి."

"నాతోపాటు ఆ గదిలో వున్న మిగతావాళ్ళ దగ్గర వసూలు చేసుకో. నాకేం సంబంధం లేదు."

"మిగతా వాళ్ళెవరు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"దోమలు, నల్లులు, ఎలుకలు, పిల్లులూ, గబ్బిలాయిలూ... వీటన్నింటినీ నేనా రూమ్‌లో దిగక ముందునుంచే వుంచావు."

"మర్యాదగా నా బాకీ తీరుస్తావా లేదా?"

"మరి ఆ పశుపక్ష్యాదుల సంగతేమిటి...? వాటిక్కూడా నేనెందుకు కట్టాలి?"

తులసి కల్పించుకుంది.

"ఎంత కట్టాలి మీకు?"

"మూడొందల అరవై"

"నెలకింత చొప్పున తీసుకోటానికి వప్పుకునేట్లయితే నేను కడతాను."

"వద్దు తులసీ! నాకు ఉద్యోగం రాగానే నేను కడతాను."

ముసలతను తల అడ్డంగా వూపాడు."వద్దు! ఆమెనే కట్టనీ..."

"ఎందుకని?"

"నీకు ఉద్యోగం రాదు"